# అంతర్మథనం

ఊళ్లోకి ప్రవేశించిన రథం ఎక్కడా ఆగలేదు. మెల్లగా కూడా వెళ్లడంలేదు. టకటక... గుర్రపుడెక్కల శబ్దం క్రమేపీ దూరం అయింది. అందులో వున్నది శంతన మహారాజు. ఎటువైపు దృష్టిలేదు. ఎవర్నీ పలుకరించడంలేదు. ఇంత నిర్లక్ష్యమా? ఈ అహంకారమే రాజవంశస్థుల్ని తినేస్తోంది. ప్రజలంటే అనుకోవచ్చు పోనీ అని. కానీ...తను ...తనని కూడా చూళ్ళేదా! ఎలాంటి తండ్రి శంతనుడు!

తండ్రిని వదిలి తల్లి వెళ్లిపోయింది. ఈ విడిపోవడం వల్ల ఎవరు, ఎంత బాధపడ్డారో తెలీదుగానీ తను అనుభవించిన బాధ మర్చిపోగలడా? పుట్టిన ప్రతీ పిల్లాడు తల్లీదండ్రీ ఇద్దరూ కావాలని అనుకుంటాడు. కానీ తనకో తల్లీదండ్రీ ఇద్దరూ వున్నా లేనట్టే!

దేవవ్రతుడి శైశవం, బాల్యం, కిశోరం, తరుణం విభిన్న ఋషులవద్ద గడిచింది. వనాల్లో, మునుల ఆశ్రమాల్లో నిష్ఠ, కఠోరమైన అనుశాసనాల్లో గడిచింది. విరాగుల మధ్య పెరిగిన తను తండ్రి నిర్లక్ష్యం బాధపడకూడదు. ప్రేమలేదని అనుకోకూడదు. తనలోనే సంపూర్ణత్వం వెతుక్కోవాలి. ఇంకోళ్ళ ప్రేమ కావాలనుకునే ఆవశ్యకత తనకెందుకు? తండ్రి తన తలమీద ప్రేమతో చెయ్యి వేస్తే ఎంత? వెయ్యకపోతే ఎంత? ఈ ఆపేక్ష ఉండకూడదు. ఈ ఆపేక్షలకి అంతం నిరాశ కాదా! నిరాశ దుఃఖానికి దారి తీస్తుంది. దుఃఖాన్నించి తప్పించుకోవాలంటే ఈ ఆపేక్షల నుంచి తప్పించుకోవాలి.

ఈ ప్రేమ, ఆపేక్ష, వాత్సల్యం అన్నీ కూడా ఒక్కోసారి మోసం చేస్తాయి. అలాంటప్పుడు ఇవన్నీ ఎందుకు? తండ్రి ప్రేమ ఏం చేసింది? తల్లి మీద మోహంతో

నోరు కుట్టేసుకున్నాడు. ఏడుగురు కొడుకుల్ని ఒకళ్ల తరువాత ఒకళ్లని నదిలో పారేసింది. తండ్రి మనసులో పిల్లలమీద వాత్సల్యం వుంటే తల్లి చెయ్యి పట్టుకుని ఆపేవాడే. కానీ ఆపలేదేం! కానీ...తన వంతు వచ్చేసరికి తల్లి చెయ్యి పట్టుకుని ఆపాడు. పర్యవసానం భార్య వెళ్లిపోవడం. దానితో బంధాలు తెంచుకున్నవాడిలా, పరిత్యాగిలా మారిపోయాడు. ఆ బాధలో...శోకంలో తనకో కొడుకున్నాడని, జీవించి వున్నాడని ఆ సంగతే మర్చిపోయాడా! తండ్రి అలా ఎందుకున్నాడో నిజం తెల్సుకోవాల్సిన బాధ్యత తనమీద వుందా?

తండ్రి భవనానికి వెళ్లాడు. స్థంభించిన వాతావరణం, మౌనం. వాతావరణం ఉల్లాసంగా, ఆహ్లాదంగా లేదు.

బొమ్మలా నుంచున్న ద్వారపాలకుడి దగ్గరకెళ్లాడు.

"తండ్రిగారికి నా ప్రణామములు నివేదించు."

ఆ సమయంలో చక్రవర్తి, సామ్రాట్, రాజు అనే పదాలు రాలేదు. అదే మమకారం.

ద్వారపాలకుడు అక్కడనుంచి కదలలేదు. లోనికెవరూ రాకూడదన్న ఆదేశం ఉండొచ్చు. కానీ...లోపలికి వెళ్లడానికి అడ్డుచెప్పలేదు.

"చక్రవర్తిగారు స్వస్థులుగా లేరు" దేవవ్రతుడు అక్కడే నుంచుండిపోయాడు.

"రాజవైద్యులకి కబురుచేసారా? మంత్రిగారెక్కడ?"

"లేదు. వొద్దని చక్రవర్తిగారి ఆదేశం. మంత్రిగారు, రాజుగారితోపాటు రాలేదు."

తండ్రి అనారోగ్య కారణం మంత్రిగారికి తెలిసేవుండాలి. ఆయనెందుకు రాలేదు! రాజవైద్యుల్ని ఎందుకు పిలువలేదు?

దేవవ్రతుడు లోనికి వెళ్లాడు.

అలసిపోయినట్లుగా లేదు. అసహాయ రోగిలాగా కూడా లేదు. తల వొంచుకుని కూచున్నాడు. 'ఏడుస్తున్నాడా?' అని ఒక్కక్షణం అనిపించింది. సంభాళించుకునే ప్రయత్నమా అది.

హస్తినాపుర చక్రవర్తి, పురురాజు, వీరుడు శంతనుడు తన మందిరంలోని గదిలో ఒంటరిగా, అసహాయంగా ఏడుస్తున్నాడా? బలవంతుడైనా, జ్ఞాని అయినా ఆఖరికి మనిషే కదా! శరీర, మనస్సు నియమాలకి దాసుడేకదా, సుఖదుఃఖాల్నించి ముక్తిలేదు.

అయినా ఆ సుఖదుఃఖాల్ని కోరుకుంటున్నాడా? మృగయా వినోదానికి వెళ్లాడు, కానీ తనే చచ్చిన మృగంలా వున్నాడు. ఎక్కడైనా గాయం అవలేదు కదా. ఊహూ...గాయాలకే ఏడ్చే తండ్రికాదు.

కొంచెం ముందుకెళ్లి తండ్రిగారి చరణాలకి వందనం చేసాడు. శంతనుడు ఒక్కసారి లేచి కొడుకుని ఆలింగనం చేసుకున్నాడు. అందులో ఆశీస్సులేదు. ఏదో ఆచారంగా కొడుకు తలమీద చేయివేసి నిమిరాడు.

"మీకు ఒంట్లో బాగాలేదా!" కృంగిపోయి వున్న తండ్రి మొహంలోకి చూసాడు.

ఒక్కక్షణం స్థిరంగా కొడుకు మొహంలోకి చూసి అస్తవ్యస్తంగా మంచంమీదనుంచి లేచాడు.

"అస్వస్థకాదు బాబూ! చింత. చింత నన్ను కాల్చేస్తోంది."

ఉలిక్కిపడ్డాడు దేవవ్రతుడు.

"చక్రవర్తికి చింతా!" మనసులోనే అనుకున్నట్లుగా పైకే అనేసాడు.

శంతనుడు కొడుకువైపు చూసాడు.

ఈ పుత్రుడు క్షత్రియ పుత్రులకు సమానుడు కాదు. వనవాసులకి, విరాగులకి సమానం. అందుకే, అలా మాట్లాడగలుగుతున్నాడు. రాజప్రసాదంలో పెరిగివుంటే ఇలా అనగలిగేవాడా?

"చక్రవర్తులకి చింతలుండవా నాయనా!"

చింతల్లేదన్న భావన కూడా చింతలకి కారణం అవుతుంది. సామ్రాజ్యంతోపాటూ చింతలు కూడా పెనవేసుకుని వుంటాయన్న విషయం తెలిసి కూడా మనిషి సామ్రాజ్య స్థాపనకోసం తాపత్రయ పడతాడెందుకో? చింతలకి నిలయం ఈ సామ్రాజ్యం అయితే దానిని ఎందుకు త్యజించరు!

దీర్ఘంగా నిట్టూర్చాడు శంతనుడు.

"గంగ తన కొడుకులందర్నీ జీవన్ముక్తుల్నెందుకు చేసిందో!"

దేవవ్రతుడికి తండ్రి మాటలు అర్థంకాలేదు. తండ్రి ఆవేదన పుత్రులకోసమా! భార్య స్మృతికా! సంతానాన్ని నీళ్ళపాలు చేసిన భార్య మీద తృణీకార భావం లేదా! సంతానం మీద ప్రేమ ఉంటే భార్యమీద కోపం ఉండేదా!

"నువ్వు నా ఏకైక సంతానానివి. ఆ విషయమే అస్తమానం మనసులో మెదుల్తూంటుంది. ఒక్క కొడుకున్న తండ్రి సంతానహీనుడైన తండ్రికంటే దుఃఖం ఎక్కువ.

ఎందుకంటే ఎలా చెప్పనూ? మనిషి ప్రాణాన్ని ఓ పక్షిలో వుంచి దాన్ని పక్షి ఆకారంలోకి మార్చేసి, ఆకాశంలోకి స్వేచ్ఛగా ఎగరనిస్తే ఆ మనిషియొక్క స్థితి ఎలా వుంటుంది?

ఆకాశంలో ఎన్నోరకాల పక్షులుంటాయి. భూమిమీద ఎంతోమంది వేటగాళ్ళుంటారు. వలలు పన్ని వుంచుతారు. లక్ష్యం పెట్టిన బాణానికి, లక్ష్యభ్రష్టమైన శస్త్రానికి ఎర కావచ్చు. ఇదేవిధమైన శంకలతో ఆ వ్యక్తి మనసు ఎలా వుంటుంది? అదే నా దుఃఖం. అదే నా చింత. నువ్వు నా ఒక్కగానొక్క కొడుకువి. నా ప్రాణాలన్నీ కూడా నీమీదే వుంటాయి. నువ్వు వీరుడివి. యోధుడివి. సదాయుద్ధానికి సంసిద్ధుడవై వుంటావు. ఏ యుద్ధంలోనైనా వీరగతి ప్రాప్తిస్తే ఈ విశాల హస్తినాపుర సామ్రాజ్యం ఏమవుతుంది? మన వంశం గతి ఏమిటి? నాకు సద్గతి ఎలా ప్రాప్తిస్తుంది?"

దేవవ్రతుడు ఆలోచనలో పడ్డాడు.

తండ్రి తన వివాహం గూర్చి మాట్లాడుతున్నాడా? ఈ వంశవృద్ధికోసం పెళ్లి సంకెళ్ళలో తను చిక్కుకుపోతాడా? మనిషికి వివాహం అవసరమా? అసలు వివాహం ఎందుకు? శారీరక సుఖం కోసమా? వంశవృద్ధి కోసమా? సమాజం కోసమా? ఈ ఆర్భాటాలు, హాహాకారాలు దేనికోసం?

తండ్రి చింత దేని గురించి? తన గురించా? పుత్రుల గురించా? సామ్రాజ్యం కోసం పుత్రులా? పుత్రులకోసం సామ్రాజ్యమా? ఈ వంశవృద్ధి దేనికోసం? సద్గతికోసమా? తండ్రికి తన మరణానంతరం ఆ కొడుకుల్ని ఎవరు సంరక్షిస్తారు అన్న ఆలోచనలేదా? ఒక వేళ ఆ రాజ్యమేపోతే ఆ కొడుకుల కోసం ధనం ఎక్కడుంటుంది? తానే శాశ్వతం కాదు. అసలు ఏదీ శాశ్వతం కాదు, అలాంటప్పుడు ఈ సామ్రాజ్యం కోసం తపన ఎందుకు?

"నా గురించి మీకు చింత వద్దు. నా గురించి మీరు బాధపడకండి. నన్ను చంపే వీరులింకా భూమ్మీద పుట్టలేదు."

-"నీమాట నిజం బాబూ! అయితే తండ్రిగా నా హృదయం నీ మాటలతో సంతృప్తి చెందడంలేదు. ఈ శరీరం శాశ్వతంకాదు. ఎప్పుడో నాశనం అవకతప్పదు. ఒకవేళ నా ఒక్కగానొక్క వంశాంకురం, ఆసమయ, అకాల మరణం పాలవుతే...ఒక్కడే కొడుకున్న తండ్రి హృదయం నీకర్థం అవుతుందా?"

దేవవ్రతుడు ఆలోచనలో పడ్డాడు.

తండ్రి హృదయంలో తన గురించి ఇంత భయభీతి వుందా? ఒకవేళ ఇద్దరు కొడుకులు ఉంటే ఆయనకీ చింతలుండేవికాదా? ఇద్దరు కొడుకులు కూడా యుద్ధంలో

మరణించవచ్చుకదా. ఇద్దరే ఎందుకు? ఎంతోమంది మరణించవచ్చు. ఉన్న కొడుకులందరూ మరణించవచ్చు. వంశానికి వంశం నాశనం అయిపోవచ్చు. నాశనం అవడానికి యుద్ధమే అక్కర్లేదు. యుద్ధం లేకుండానే ఒక్క కపిల ముని శాపంతో సగరపుత్రులు నాశనం అయిపోలేదా? పుత్రుల సంఖ్య ఎంతయితేనేం? అసలు పుత్రుల సంఖ్య గురించి తండ్రి బాధపడ్తున్నాడా? తన కళ్లెదుట తన కొడుకుల సంగతి ఏమయింది?

శరీరం శాశ్వతం కానప్పుడు ఈ వంశపరంపరలెందుకు? ఈ తాపత్రయాలన్నీ ఎందుకు? మరణానంతరం కొడుకుల్లేకపోతే సద్గతి రాదా? పుత్రుడి రూపంలో తన జీవిత వికాసాన్ని చూసుకుంటున్నాడా? వృద్ధాప్యంలో చేయూతనిస్తాడనా? తన సద్గతికోసం, తన స్వార్థంకోసం, తన సుఖ సౌలభ్యాలకోసం పుత్రుల్ని వాంఛిస్తున్నారా? ఈ వంశాభివృద్ధికి ఇన్ని ప్రయత్నాలా? స్వయంగా తానే కాలంతో పోరాడలేని వాడికోసం ఈ మార్గాలెందుకు పెట్టారు?

తండ్రి అంతరంగం ఏమిటి? రెండో పెళ్లి కావాలనుకుంటున్నాడా? నిజానికి తల్లి వెళ్లిపోయాక తండ్రి వివాహం చేసుకోలేదు. ఎందుకని? తన స్థితిమీద సంతృప్తి చెందాడా? లేక తల్లిని మర్చిపోలేకనా? సంసారంమీద ఆసక్తిలేకనా? తల్లిని చూసినప్పుడు ఆలోచించనే లేదు. ఆమె ఎవరూ, ఏ కులం? ఎవరి కూతురు? ఆమె సంబంధీకులు ఎవరు? ఏ విధమైన ప్రశ్నలు అడగలేదు. అడగదల్చుకోలేదు కాబోలు. ఆమె రక్తశుద్ధి గురించి, కులగోత్రాల గురించి ఆలోచించలేదు. క్షణాల్లో పెళ్లి చేసుకున్నాడామెను. ఎందుకో అది దైహికాకర్షణా! ఆ దైహికాకర్షణ వారి సంసార జీవితానికి ఆధారం కాలేదా? ఆకర్షణ వలననే కదా తండ్రి తల్లిని పెళ్లి చేసుకున్నాడు. కానీ ఆ సంసారమేది? కలసి వుండడం, పిల్లలు పుట్టడం సంసారమా? అంటే ఈ శరీరాకర్షణ ఒక బంధం. ఓ వల. అమాయకపు పక్షి అందులోని గింజలకోసం వచ్చి చిక్కుకున్నాక తెలుస్తుంది ఎగరలేని అసమర్థత. ఈ దుఃఖాలన్నీ మోహంలోంచేకదా!

అమ్మ తన సంతానాన్ని నదికి సమర్పించిందట. నాన్నగారు ఆపలేక పోయారు. సంతానంకోసం భార్యని వదులుకోవడానికి ఇష్టపడలేదు. వారి సంసార బంధాన్ని విచ్ఛేదించుకోడం ఇష్టంలేకనా? సహజంగా స్త్రీకి ఉండాల్సిన మమత పొరలు తల్లిలో ఉండి వుంటే, తల్లి పిల్లల్ని నదిలో పారేసేదా? ఏడుగురు కొడుకుల్ని నదిలో పారేసిన ఆమె మనసులో దేవవ్రతుడికోసం ఏ మూలాం అనురాగం వుంటుంది?

ఆమె తండ్రితో విడిపోవడానికి కారణం వెతుక్కుంది. తన సంతానాన్ని ఒక్కొక్కళ్లనే జీవన్ముక్తుల్ని చేస్తూ భర్త మనసుని తెలుసుకుంటోంది. పరీక్షలా! స్త్రీ ఆమె. ఏ బాధ్యతలతో తండ్రిని పెళ్లి చేసుకుంది? ఏమాశించింది? ఎందుకు పిల్లల్ని నదిలో పారెయ్యాల్సివచ్చింది?

తండ్రి నిజంగా తన బాధ్యత నెరవేర్చగలిగాడా? కొడుకుల రక్షణ అతని బాధ్యత కాదా? అప్పుడు గుడ్డులోంచి వచ్చిన పిల్లని తన రెక్కల్తో రక్షించే తల్లి పిట్టలా ప్రయత్నం ఎందుకు చేయలేదు? పుత్రుడి మీద ధ్యాసలేనేలేదా? ఆలోచిస్తుంటే తల్లిదండ్రి ఇద్దరూ అద్భుతంగా అనిపించసాగారు. తన తల్లి తండ్రి సంతానికి జన్మనిచ్చారు. వ్యక్తిగతం. ఎప్పుడంటే అప్పుడే నష్టపర్చడం కూడా వాళ్ళ వ్యక్తిగతమా? ఆ అధికారం తల్లికుందా? అదికూడా నదిలో పారేసేంత. ఒకరి జీవితాన్ని నష్టపరిచే అధికారం ఒకరికెందుకుంటుంది? సంతానం ప్రకృతి విధానం. వాళ్ళని మధ్యలో ఉంచి ప్రకృతి సృష్టి సాగిస్తోంది. అలాంటప్పుడు జీవితం ఓ స్త్రీకి, ఓ పురుషుడికి సమాప్తం అవుతుందా? ఆ తరువాత కొనసాగించే పిల్లలున్నారుకదా. ఆ పిల్లల్ని జీవన్ముక్తుల్ని కావించడానికి అధికారం ఎవరిచ్చారు? ఇవి హత్యలు కావా?

తల్లిదండ్రిది ఎలాంటి దాంపత్యం అయి వుంటుంది? ఓ హంతకురాలి మోహంలో ఇరుక్కుపోయాడా తండ్రి. తన తల్లి ఏ బాధ్యతవలన తండ్రి దగ్గర వుండిపోయింది? తండ్రి ఎంత బలహీనుడో, దుర్బలుడో తల్లి మనసు అంత దృఢమైనది, కఠోరమైనది.

తండ్రి ఆమెను మొదటిసారి చూసినప్పుడే దాసుడైపోయాడు. శరీర సాహచర్యంతోపాటూ మనస్సుకి కూడా సాహచర్యం లభించి వుంటుందా? తన తల్లికి ఆ సాహచర్యం ఇష్టపడలేదా? తనకిష్టమైనప్పుడు వచ్చి తన కిష్టమైనప్పుడు వెళ్లిపోయే వారి దాంపత్య జీవితాలు ఎలా వుంటాయి? ఆ సంసారం సజావుగా, సుఖంగా వుంటుందా? అసలు సుఖం ఏమిటీ? ఎలా వుంటుంది? దానియొక్క స్వరూపం ఏమిటి? తన తండ్రి ఎంత సుఖం పొందాడు? ఎంత త్యాగం చేసాడు? కానీ...

తండ్రిమీద కరుణ ఒక్కసారిగా పొంగింది. దయ కలిగింది. భార్య వెళ్లిపోయాక చక్రవర్తి సుఖాన్ని త్యాగం చేసాడని అంతా అనుకుంటుంటారు. కానీ దేవవ్రతుడికి తెలుసు,

తండ్రి మనసులో కోరికలున్నాయని, తల్లివెళ్లి పోయాక ఆయన్ని భయంకరమైన అశాంతి పీడిస్తోంది. ఆ మనఃస్థితిలో మిగిలిన కొడుకుని గూర్చి ఆలోచించలేదు.

వశిష్ఠుడి ఆశ్రమంలోనూ, పరుశురాముడి ఆశ్రమంలోనూ, బృహస్పతి, శుక్రాచార్యుల, ఇంకా దేవఋషుల ఆశ్రమాల్లో అనేక సంవత్సరాలు గడిపాడు. తల్లి సంగతే తెలియదు. తండ్రికి తనపట్ల ఉదాసీనత. అలాంటిది, ఇంతకాలం అయ్యాక ఈ రోజున అకస్మాత్తుగా, హఠాత్తుగా, ఒక్క పుత్రుడి గురించి వంశ పరంపరల గూర్చి చింతితుడైనాడు.

దేవవ్రతుడు అమాత్యులవారి వద్దకు వెళ్లాడు.

ఆయన చాలా మామూలుగా, సహజంగా వున్నారు. తన తండ్రి బాధ, చింతలతో ఆయన సంబంధం లేనట్టుగా ఉన్నారు.

చక్రవర్తి అస్వస్థత తన భ్రమా? మంత్రి అజ్ఞానమా?

"చక్రవర్తిగారు అస్వస్థులుగా ఉన్నారు."

"నాకు తెలుసు యువరాజా!"

"ఆయనకి ఉపచారం ఎందుకు చేయడంలేదు? రాజవైద్యుల వశం..."

"ఆయన ఉపచారం ఎవరి వశంలో లేదు. కానీ...అంతా మీ వశంలో వుంది. నిజానికి మీ చేతుల్లో కూడా లేదు."

కింకర్తవ్య విమూఢునిలా నుంచుండిపోయాడు. తన చేతుల్లో ఏవుంది? అసలు మంత్రిగారు ఏం చెప్పదల్చుకున్నారు?

"మహారాజుగారిని కామజ్వరం పీడిస్తోంది. అందుకే ఆయన రాజవైద్యుల సహాయం తీసుకోలేదు."

ఒక్కసారిగా అలలు అంత ఎత్తుగా ఎగిసాయి. కిందకి విరిగిపడ్డాయి. అందుకా! ఇన్ని ఏళ్ళ తరువాత ఒక్కగానొక్క కొడుకు గురించి ఆయన చింత. ఇన్ని ఏళ్ళ తరువాత...తిరిగి...తండ్రి....

తండ్రికి ఈ కామజ్వరం ఉంటే వివేకం నశించిపోతుందా? అయినా ఆ స్త్రీ ఎవరు? ఇన్ని ఏళ్ళ తరువాత తండ్రిలో నరనరాల్ని లాగేసి అడుగుపొరల్లో ఘనీభవించిన ప్రేమని కరిగించి తిరిగి రేకెత్తించిన స్త్రీ ఎవరు?

"కానీ...నాతో...ఏం అనలేదే?"

"ఎలా అనగలరు? వయసులో వున్న కొడుకు దగ్గర మళ్లీ పెళ్లి గురించి ఏ తండ్రి ప్రస్తావించగలరు? ఈమె లేకుండా ఉండలేరు. అలా అని పెళ్లి చేసుకోలేరు."

"ఎందుకని చేసుకోలేరు? యుక్తవయస్కుడైన కొడుకున్నాడనా? అది ఓ కారణం కాదే? ఇది వరకు చాలా మంది చేసుకున్నారుకదా."

దీర్ఘంగా శ్వాస తీసారు మంత్రిగారు.

"చేసుకున్నారు బాబూ. చేసుకున్నారు. అందుకని ఎంతో కొంత మూల్యం ఇచ్చుకున్నారు. యయాతి పురుల సంగతి తెలిసినదే కదా!

"అసలు జరిగింది సవిస్తరంగా తెలియజేయండి."

"యమునా నదీ తీరాన దాసరాజనే పడవ నడిపేవాడున్నాడు. ఆయన కూతురు సత్యవతి. అత్యంత రూపవతి. ఆమెను చూసి చూడగానే వివాహం చేసుకోవాలన్న తలంపువచ్చింది. అదే విషయం దాసరాజుని అడిగారు. అయితే ఆయన ఒక షర్తుని..."

"ఎటువంటి షర్తులు?" మధ్యలోనే అన్నాడు దేవవ్రతుడు.

"ఇలాంటి వివాహ సమయాల్లో ఎటువంటివి వుంటాయి! కొత్తరాణి పుత్రులకి సింహాసనాధికారం ఉండాలని, అందుకే అంటున్నాను మీ చేతుల్లో కూడా ఏమీలేదని."

దేవవ్రతుడికి ఏం చెప్పాలో తెలీలేదు.

తండ్రి ఆంతర్యం ఏమిటి? మంత్రిగారి మాటలు విన్నాకా తండ్రి మాటలు నెమరేసుకున్నాడు. వాటి అర్థం ఏమిటీ? తన అధికారాన్ని వదులుకోమంటున్నాడా? తండ్రి అనలేక మంత్రిద్వారా అనిపించాడా? ఇదే తండ్రి కోరికా? ఇదే అయితే, కామాసక్తతో వున్న వ్యక్తి యొక్క కోరిక ఇది. ఆసక్తి ఎక్కువైనప్పుడు వివేకం తన స్థితి మరిచిపోతుందా? తనని ప్రత్యక్షంగా అడగడం బాగుండదని తండ్రి అనుకుంటున్నాడా? తండ్రికి తెలుసు తన దగ్గర ఇటువంటి ప్రస్తావన అనవసరం అని. ఈ అనుచితాన్ని ఏవిధంగానైనా సంభవం చేయడానికి వీలవుతుందా అని అనుకుంటున్నాడా? అందుకేనా మరో కొడుకు కావాలన్న ఆలోచన తన దగ్గర వ్యక్తం చేసాడా? ఇదా తండ్రి రూపం?

పురుషుడి సమస్తం స్త్రీయేనా? పురుషుడి సర్వం ఆమెమీద ఆసక్తా? ఏ రోజున ఆ స్త్రీ విడిచి వెళ్లిపోతుందో, ఈ ప్రపంచం అంతా ఓ మాయలాగా కనబడుతుందా? మళ్ళా ఏ రోజున స్త్రీ కనబడుతుందో తిరిగి అదే ప్రపంచం అద్భుతంగా, మోహంగా కనబడ్తుందా? అంటే తన తండ్రి ఓసారి అయిన అనుభవం నుంచి ఏమీ నేర్చుకోలేదు. ఇది ప్రేమకాదు. ఆకర్షణ. ఆయన వివేకానికి హత్య. ఓ మోహాసిక్తమైన వల.

పుత్ర ప్రేమ పేరుతో తండ్రి ఏం చేస్తున్నాడు? తన మీద వున్న పైతృకాధికారాల్ని లాగేసుకుంటున్నాడా? తండ్రి కామాసక్తుడవుతే అవనీ, రెండో వివాహం చేసుకుంటే చేసుకోనీ. రాజ్యం ఎవరికిచ్చుకుంటే ఇచ్చుకోనీ! దేవవ్రతుడికేం నష్టంవుంది? ఆపద ఏం వుంది? ఏమీ లేదు. తండ్రి కోరికలను తన విఘ్నరూపంలో రావాలనుకోవడం లేదు. కానీ...అధికారం మాటకొస్తే....మనస్సు చివుక్కుమంటుంది.

పౌరవ రాజ్యం యొక్క ఈ రాజ్యాధికారం దేవవ్రతుడికే వుంది. న్యాయసిద్ధంగా దేవవ్రతుడే యువరాజు. వస్తువుల్ని దానం చేయడానికి దేవవ్రతుడికేమాత్రం కష్టంలేదు. ఎవరి అవశ్యకతనైనా పూర్తి చేయడం కోసం త్యాగం చేయడంలో నష్టంలేదు. కానీ...అనుచితమైన...అసందర్భమైన కోరక కోసం తన న్యాయోచిత అధికారాన్ని వదిలేసుకోవడం ధర్మమా!

అప్పుడు తల్లి వరుసగా ఏడుగురి కొడుకుల్ని నీళ్ళపాలు చేసినప్పుడు, ఆమెమీద మోహంతో ఆమెని ఆపలేకపోయాడు. ఈ రోజున తన సంతాన అధికారం గురించి ఒక్క ముక్క అనలేకపోయాడు. ఈ రోజున అదే మోహంతో దేవవ్రతుడి న్యాయసిద్ధ, న్యాయోచిత అధికారం గురించి మాట్లాడడం లేదు. శంతనుడు కొడుకుని తన అధికారాల్ని త్యాగం చేయమని చెప్పలేదు. తన మంచంమీద సగం మొహం కిందకి దించుకుని తన బాధని కన్పింపజేసాడు. అంటే పరోక్షంగా త్యాగం చెయ్యమనేనా? ఈ రోజున దేవవ్రతుడు తన అధికారాన్నిత్యాగం చేయకపోతే రానున్న ముందు తరాలవాళ్ళు తనని పితృద్రోహి అని అనరా? తండ్రికోసం తన రాజసౌఖ్యాల్ని త్యాగం చేయలేనివాడు అని అనరా? రాజసౌఖ్యం...ఏమిటది?

తన తండ్రి చక్రవర్తి. ఆయనకి విరుద్ధంగా ఏదీ నడవదు. అయితే ఆయన సుఖంగా వున్నాడా? చక్రవర్తి అయ్యుండి కూడా ఓ సామాన్య యువతికోసం చేతులు నలుపుకుంటున్నాడు. ఎక్కడుంది రాజసౌఖ్యం? రాజ్యం మూలంగా సుఖం వస్తుందా? ఏ సుఖంకోరి తండ్రి ఇదివరకు అలమటించాడు? అది దొరికిందా? అందులోని వంచనను తల్చుకుంటూ ఇన్నేళ్ళున్నాడే! మళ్ళా ఇప్పుడు...

సరే! దేవవ్రతుడికి రాజ్యంమీద మోహంలేదు. రాజ్యం లేకుండానే సంతుష్టుడిగా ఉండగలడు. ఇష్టపూర్వకంగానే తన అధికారాల్ని వదులుకోగలడు. అది ఆదర్శమా? ఓ

వ్యక్తి ఆదర్శం సమాజానికి ఆదర్శం అవదా? తను వ్యక్తిగా చేస్తున్న త్యాగం సమాజం దృష్టిలో త్యాగమేనా? అధికారం కోసం పోరాడడం ధర్మమా? అధికారాన్ని వదులుకోవడం, అధికారాన్ని త్యాగం చేయడం ధర్మమా?

హస్తినాపుర సామ్రాజ్యం తన తండ్రి స్వంత ఆస్తికాదు ఎవరికి కావాలనుకుంటే వారికివ్వడానికి. ఒక విధంగా ఇది రాజ్యాపహరణ అవుతుంది. ఇలా అపహరించిన రాజ్యాన్ని ఏలే వ్యక్తి రేపు హస్తినాపుర ప్రజల క్షేమం గురించి ఆలోచిస్తాడా? తన క్షత్రియ ధర్మాన్ని నిర్వర్తిస్తాడా? క్షాత్ర ధర్మం అంటే ఏమిటి? ఎవరైనా రాజ్యాన్ని అపహరణ చేస్తామంటే అలాగే వదిలేయడం క్షాత్రధర్మం అవుతుందా? క్షాత్ర ధర్మం ఎందులో వుంది? సమాజ పాలనలో వుంది. అన్యాయానికి ఎదురు తిరగటంలో వుంది. అపహరణ కర్తల్ని విరోధులుగా తలవడంలో ఉంది.

మనసులో అజ్ఞాత యువతి ఆమె తండ్రి విరోధులుగా అనిపించారు. వాళ్ళు సైన్యాన్ని తీసుకువచ్చి ఈ హస్తినాపురాన్ని ఆక్రమించకపోవచ్చు. కానీ ఓ మాటతో రాజ్యాన్ని తీసుకోవడం అపహరణే అవుతుందా? తననితాను సంభాళించుకున్నాడు. తనకు ఆ యువతి తెలీదు. ఆ యువతికి తను తెలీదు. తెలీని వ్యక్తిమీద విరుద్ధ భావం పెంచుకోవడంలో అర్థం ఏమిటీ? ఆ యువతితో తనకెందుకూ విరోధం? చక్రవర్తి కోరుకున్న ఓ అనుచితమైన కోరికకు ఆమె మూల్యం అడుగుతోంది.

ఈడూజోడూ సరిగా కుదరని రాజుల వివాహ విషయాల్లో కన్యాదాతలు తమ మనవలకోసం రాజ్యకాంక్షని వ్యక్తీకరించడం అతి సహజం.

సమాజం, దేశం అధికారాలకోసం పోరాడనీ, కానీ దేవవ్రతుడు తన అధికారాలకోసం కలహం తేడు. తన అధికారాన్ని విడనాడగలడు. తన అధికారాలకోసం కులంలో పోట్లాటలు రాగూడదు. ఎవరికి సుఖం ఈ పోట్లాటలవలన? దేవవ్రతుడు రాజ్యాన్ని వదిలేస్తేనే ఇంకా సుఖంగా వుంటుంది?

తను తండ్రి సుఖం కోరుకుంటున్నాడు. దాసరాజు కూతురిది, మనమలది సుఖం కోరుకుంటున్నాడు.

తండ్రికి దాసరాజు కుమార్తె దొరుకుతుంది.

దాసరాజుకి తన మనవలకోసం రాజ్యం దొరుకుతుంది.

వారికి కావాల్సింది దొరుకుతుంది.

దాసరాజు, కూతురిది, మనవలది సుఖం కోరుకుంటున్నాడు.

ఓ యువతికోసం, ఏ వృద్ధుడు పడే ఆతృత ఆసక్తి ఏ విధమైన సుఖాన్నిస్తుంది! ఆ దాంపత్య జీవనం బాగుంటుందా! అందులో ప్రేమ ఉంటుందా! తండ్రికి ఈ విధమైన ప్రేమ పరిచితం కాదు. తిరిగి కామంసోకం, మోహంకోసం తపించే వ్యవస్థలో ఉన్నాడు.

ఆ కన్యకు మాత్రం ఏం సుఖం? మామూలు నావ నడిపే వాడి కూతురు, రాజ ప్రాసాదంలోకి అడుగు పెట్టాకా తన హీన భావనలు పోవుకదా! ఆమె భావనలతో వేరే వాళ్ళని కష్టపెడ్తుంది. పరిహాసం చేస్తుంది. ప్రతీకార చర్యలని, ప్రతి హింసలని నిర్బలుల మీద చూపుస్తుంది. ఆమె ముందు శంతనుడితో సహా అంత నిర్బలులే.

చక్రవర్తి ఈ సమయంలో వివేక శూన్యడిగా ఉన్నాడు. అతనికి తెలీదు సుఖం ఏ మాటలో ఉందని! ఎందులో ఉందని? ఏమీ తెలియని పసివాడి కోరికలు, ఉన్మాది కోరికలు నెరవేర్చడం కష్టం...హితం కాదు.

నిజంగా దేవవ్రతుడు తండ్రి సుఖం కోరుకుంటున్నవాడయితే, ఆ కన్యామోహంలోంచి రాజుని తప్పించాలి. చిన్నపిల్లాడు నిప్పు ముట్టుకుంటానంటే ఆ కోరిక తీర్చరుకదా! ఇది కూడా అలాటిదే!

దేవవ్రతుడు ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు.

వాదనలతో తర్కాలతో తండ్రిని ఓడించి రాజ్యాన్ని తీసుకుందామని అనుక్కుంటున్నాడా! మదిలో కాలుష్యం, మాటల్లో తెలివి రాజ్యాన్ని, అధికారాన్ని వదులుకోదానికి యిష్టపడడంలేదా! వంశవృద్ధి పేరుతో పెళ్ళిచేసుకుంటే రాజ్యసౌఖ్యము, స్త్రీ సౌఖ్యం రెండూ ఉంటుంది.

ఉహుఁ...తను కోరుకునేది యిది కాదు. తన మనసు కలుషితం కాకూడదు. తనేం చెయ్యాలో ఆలోచించడం మొదలెట్టాడు.

ఒక రథం మీద దేవవ్రతుడు, సేనాధిపతి మంత్రి, మరో రథంమీద దాసీజనము, ప్రొద్దున్నే బయల్దేరి వెళ్ళారు.

దాదాపు మధ్యాహ్నం అవుతుండగా యమునానది ఒడ్డున ఉన్న గ్రామం చేరారు. అక్కడ చేపలు పట్టేవాళ్ళున్నారు. పడవలు నడిపే వాళ్ళూ ఉన్నారు.

రథాలు ఆగిపోయాయి.

సైనికుల్ని, రథాల్ని చూసి పిల్లలు పెద్దలు గాబరాపడి పోయారు. ఒక్కక్షణం మరుక్షణంలోనే తమాయించుకున్నారు. కోపం, అవమానం ఈ విషయంలో అనవసరం.

దాసరాజు ఓ సాధారణమైన మనిషి. ఎక్కువ చదువుకున్న వాడు కాదు. అందుతే తను మట్లాడే మాటలు ఎదుటి మనిషిలో ఎటువంటి మార్పులు తెస్తున్నాయన్న ఆలోచన ఉండదు.

"లేదు. హరించము." దృఢంగా, స్పష్టంగా అన్నాడు దేవవ్రతుడు.

"యువరాజా! నేను...నా స్థితి...నా అంతస్తు నాకు బాగా తెలుసు..."నిర్భయంగా గట్టిగా అన్నాడు దాసరాజు.

" ... ... సత్యవతి నా కూతురు. ఆమెని రక్షంచుకోడం కోసం నా దగ్గర ఏమీ లేదు. మీరు సమర్థులు. మీ దగ్గర సైన్యం ఉంది. శాసనం ఉంది. మీరు కానీ, మాహారాజు శంతనులువారు కానీ ఆమెను హరించితే నేనెలా ఆపగలను?"

"మీరు నిశ్చింతగా ఉండండి. మీ కూతుర్ని ఎవరూ హరించరు. ఎత్తుకు పోయి పెళ్ళిచేసుకోడం క్షాత్రధర్మం. అదీ ఎప్పుడు? ఎదుటివాడు బలవంతుడు, సశస్త్రుడు, యోధుడు అయినప్పుడు. మీరు వృద్ధులు, పెద్దవారు పైగా నిరాయుధులు. ఇటువంటి పరిస్థితిలో మీ కూతుర్ని ఎత్తుకు పోవడం క్షాత్రధర్మానికి అనుకూలం కాదు. పైగా మీరు స్వయంవరం ప్రకటించలేదు."

"అయితే..."

"మీ అనుమతితోనే, ఆమె నా తండ్రికి భార్య అవుతుంది."

"నేను కన్యాదానానికి ఒప్పుకోకపోతే మీరు వెళ్ళిపోతారా!"

ఒక్కసారి రక్తం పొంగి వేడి ఎక్కినట్లనిపించింది దేవ వ్రతుడికి. మొహంలో రంగులు మారాయి. కానీ, వెంటనే తనని తాను శాంత పర్చుకున్నాడు.

"నా యాచనని మీరు తిరస్కరించరని నాకు తెలుసు."

"యువరాజా! నా కర్థం కాలేదు.'

"ఏంవిటీ?"

"నేను అంగీకరించకపోతే మీరు హరించమన్నారు. ఉత్తచేతులతో తిరగి వెళ్ళమన్నారు. బలాత్కారం చెయ్యం అని అంటున్నారు. అంటే...ఏం చెయ్యదల్చుకున్నారు?"

"మేం మీ అమ్మాయికి మూల్యం కడ్తాం" దృఢంగా అన్నాడు.

"మీరు కన్న తండ్రి కన్యాదానం మీరు చేస్తారు నిస్సంకోచంగా అడగండి."

కొంచెంసేపు దేవవ్రతుడి మొహంలోకి చూసి అన్నాడు.

"ఎలా అడగను? ఏ ముఖంతో అడగను? నా మాటల వల్ల ఒకరికి హితం, మరొకరికి అన్యాయం జరుగుతుందేమోనని భయంగా ఉంది. శతృవులు ఎవరూ కారు. కానీ...మా క్షేమం, మా హితం చూసుకుంటే వేరే వాళ్లకి, నష్టం అన్యాయం జరుగుతుందేమోనని అనిపిస్తోంది యువరాజా!"

"న్యాయ సంబంధ వ్యవహారాల్లో ఒకరికి అహితం అంటూ ఏమీ జరగదు. మీరు మీ మాటల్ని కానివ్వండి."

"యువరాజా! మీ కంతా తెలుసు. అంతా అర్థమయ్యి ఉంటుంది. ఈ నాటి పరిస్థితి సర్వ సామాన్యంగా లేదని."

"... ... ..."

"ఓ వైపు కురుపతి, మరోవైపు పడవ నడిపే వాడు. సామాజిక హోదాలో బేధం ఉంది. వరుడికి, కన్యకి వయోబేధం ఉంది. వరుడి తండ్రి కన్యతండ్రి వద్దకు రాలేదు. కానీ ... వరుడి కొడుకు కన్య నిమ్మనమని అడగడానికి వచ్చాడు."

"బేధం ఏవుంది యిందులో"

"చాలా ఉంది యువరాజా! ఎప్పుడైతే తండ్రి తన కుమారుడి కోసం కన్యనిమ్మనమని అడగడానికి వస్తాడో, అప్పుడు ఈ కన్యతండ్రికి, కూతురి భవిష్యత్తు మీద చింతలుండవు. కారణం ఆ తండ్రి తన సమస్తం కొడుకుకే యిస్తాడు కాబట్టి. కానీ ... వర్తమాన స్థితిలో నా కూతురి భవిష్యత్తు మీద నాకు చింతలుండవా!"

"ఎందువల్ల?"

"కొంచెం స్పష్టంగా వివరించండి."

"రాజా శంతనుడు ఏ విధంగానూ నా కూతురు సత్యవతికి ఉపయుక్తుడు కాదు. ఆయన దేశానికి రాజు. అదొక్కటే ఉపయుక్తం"

దేవవ్రతుడు మౌనంగా దాసరాజునే చూస్తున్నాడు.

"దరిద్రావస్థ నుంచి రాజభోగాలనుభవించ వచ్చని, పుట్టబోయే కొడుకులు యమునా తటి సైకత నేలల్లో ఆడుకోరని, హస్తినాపుర రాజకుమారుల్లాగా పెరుగుతారన్న ఉద్దేశంతోనే సత్యవతి శంతనుడి భార్యగా రావాలి. కానీ ... ..."

"కానీ ... ఏంవిటో సెలవీయండి."

"హస్తినా పుర యువరాజు యోధుడు, శక్తిసామర్థ్యాలున్నవాడు, బుద్ధిమంతుడు, పైగా విద్యావంతుడు, అన్నింటికి మించి లోకప్రియుడు తండ్రి తరవాత ఆ రాజ్యానికి, సంపదలకి, కులగోత్రాలకి వారసుడవుతాడు. అటువంటప్పుడు నా కూతురు, ఆమె సంతానం యొక్క భవిష్యత్తు ఏంవవుతుంది? దాసీ పుత్రుల జీవనమే వాళ్ళకీ గతి అవుతుందా!"

"కాదు ... ... వాళ్ళు ఎన్నటికీ దాసీపుత్రులు కారు, కాలేదు."

"మరి ఏమవుతారు?"

"మీరు ఏది కావాలనుకుంటే ..." చాలా సహజంగా అన్నాడు దేవవ్రతుడు.

"చక్రవర్తి భార్య నాకూతురు అయినప్పుడు ఆమె సంతానం రాజుగారి పిల్లలుగా చలామణి అవుతారా!"

"ముమ్మాటికి అవుతారు"

"ప్రమాణం!"

"మీరూ ప్రమాణం చెయ్యమంటున్నారా!"

"సత్యవతి జేష్ఠ పుత్రుడు హస్తినాపుర యువరాజు అవుతాడా!"

"అవుతాడు. అది నా కంగీకారమే."

ఆశ్చర్యంగా దేవవ్రతుడి మొహంలోకి చూసాడు దాసరాజు.

"యువరాజా! నేనేం అడుగుతున్నాడో మీ కర్థం అవుతోందనుకుంటాను."

"పూర్తిగా ..." చిరునవ్వుతో అన్నాడు.

"మీ తండ్రిగారి అనంతరం మీరు సింహాసనాన్ని అధిష్టించుతారు. రాజ్యం మీకు రాదు. మీరు యువరాజు కారు. ఈ కౌరవ సామ్రాజ్యం మీకు రాదు మామూలు ప్రజల్లో ఒకరిగా మిగిలిపోతారు."

దేవవ్రతుడు నిశ్చలుడై దాసరాజునే చూస్తున్నాడు.

శాంతం...కాంతి...క్రమేపి కళ్ళల్లో తేజస్సు, క్షితిజాన్ని దాటి పోతున్న దృష్టి.

అతనికి తను ఓ చిన్న కుటీరంలో లేనట్లుగా అనిపించింది.

ఓ ఆరుబయట కూచున్నాడనిపిస్తోంది. అక్కడ హద్దుల్లేవు. స్వార్థంలేదు. బంధాల్లేవు, మోహాల్లేవు, ఆర్జనలేదు. పృధ్వీ అకర్షణ లేదు. గాలి ఒత్తిడి లేదు. మనస్సులో లాభం లేదు. కల్మషాల గ్రహణం లేదు.

మనసులోంచి ఓ స్త్రీ మూర్తి కన్పించి అంటున్నట్లుగా అనిపిస్తోంది. "దేవవ్రతా! నీ మనసుకి ముక్తి లభించింది. ఈ ప్రపంచం నుంచి విడిపోయావు. నువ్వు సుఖంగా ఉండగలవు. గ్రహించడం కేవలం దుఃఖం మాత్రమే త్యాగం స్వాంత్వనం ఈ మోహచక్రం నుంచి నిన్ను ఎప్పుడో విముక్తుడిని చేద్దామనుకున్నాను. కానీ...నీ తండ్రి నా కోరికని ఫలించనవ్వలేదు."

ఆమె తన తల్లా! తన సుఖం కోరిన దేవత. ఈ తృష్ణ నుంచి బయటపడేసిన తల్లి. తనకి తాను ఓ తపస్విలా అనుభూతి చెందాడు.

ఏమీ లేకపోయినా భూమిమీద అధికారాల్ని కాపాలనుకోడు.

రాజప్రసాదంలో ఉంటూ కుడా ఏ కోరికలు కోరుకోడు.

స్త్రీ విహీనుడైనా స్త్రీమీదకి దృష్టి వెళ్ళనీయడు.

దేవవ్రతుడి మొహంలో శాంతం అధికం కాసాగింది. ఆయన ఆత్మకి అంతకంతకూ సంతోషం ఎక్కువైంది.

చెరగని, చెదరని చిరునవ్వు.

"నేను మీకు మాట యిస్తున్నాను"

"నిజానికి, నాకు మీ దగ్గర మాట తీసుకోటం కన్నా మరో మార్గం లేదు. అందుకే..."

"దాసరాజా! కురువంశంలో మాటే ప్రమాణం" కొంచెం గొంతు పెంచి అన్నాడు.

"శాంతించండి యువరాజా!" దీనంగా అన్నాడు.

"... ... దాసరాజు కురువంశీయులతో జీవితం సాగించలేదు. మాటంటే ప్రమాణమే అని తెలుసుకోడానికి."

ఓ దుర్బలుడి శంకలని మరోలా భావించకండి. ఎక్కడ ప్రేమ, మమత ఉంటుందో అక్కడ ఆ శంక ఉంటుంది. ఎక్కడ ఆశంకలుంటుందో అక్కడ సందేహం కూడా ఉంటుంది."

"అంత మాత్రానా మరొకరి విశ్వాసాన్ని నిరసించకూడదు."

"కానీ, నా తర్కం వింటారా! ప్రభూ!"

"తప్పకుండా!"

"కురువంశీయులకు మాట ప్రమాణమే. ఇది మీకు తెలుసు. మీ స్థానంలో చక్రవర్తిగారు ఉంటే ఆ మాట నివ్వరు. అందుకే మిమ్మల్ని...మీరు యిక్కడికి రావాల్సి వచ్చింది."

"అంగీకరిస్తున్నాను"

"అంటే దీని అర్థం పుత్రుడి స్థానంలో తండ్రి మాట యివ్వలేదు. ఎందుకంటే అది సంభవంకాదు కనక. తండ్రి ద్వారా యిచ్చిన మాటని కొడుకు ... ... "

"ఆగండి. కురువంశంలో దానికి అర్థం – కొడుకు స్థానంలో మాటయిచ్చి ఆ తండ్రి కొడుకుని అన్యాయం చెయ్యడం యిష్టంలేకనే"

"సత్యం కావచ్చు. కురు వంశంలో తండ్రిస్థానంలో కొడుకుగా మీరు అన్నదే చెప్తాను. తండ్రి కొడుకు స్థానంలో ఉండి మాట యివ్వడం ఉచితంకాదు. అందుకే మీ స్థానంలో ఉండి మీ తండ్రిగారు మాట యివ్వలేకపోయారు..."

"అవును ..."

"మీరు మీ పుత్రుల స్థానంలో ఉండి మాట యివ్వడం ఉచితంగా అనిపిస్తోందా!"

మౌనం.

"మీరు సత్యవతి పుత్రులకోసం రాజ్యాధికారాన్ని వదులుకుంటున్నారు. నాకు మీ మీద నమ్మకం ఉంది. విశ్వాసం ఉంది. కానీ రేపు మీకు వివాహం అవుతుంది. పిల్లలు పుడ్తారు. పెద్దవాళ్ళు అవుతారు. మీతో ఏకీభవించలేకపోవచ్చు. వాళ్ళ అధికారాల్ని అడగవచ్చు. మిమ్మల్ని ప్రశ్నించవచ్చు. 'మీరు మీ అధికారాన్ని వదులుకోవచ్చు. సుఖాల్ని, భోగాల్ని త్యాగం చెయ్యచ్చు. కానీ, శంతనక చక్రవర్తి రాజ్యం హస్తినాపురాన్ని పూర్తిగా సత్యవతి పిల్లలకి యివ్వడానికి మీకేం అధికారం ఉంది! అని అడగవచ్చు. మరి, మీ పుత్రుల స్థానంలో ఉండి మాట ఎలా యిస్తారు అని ..."

ఏ ం సమాధానం యిస్తాడు! ఒప్పుకోవచ్చు. నవ్వి కొట్టిపారేయచ్చు. కోపం తెచ్చుకోవచ్చు.

కళ్ళముందు ఏదో రకరకాల శృంఖలాలు, విచ్ఛిన్నమయిపోతున్న శకలాలు ఏదో పొగలు అంతా ఒక్కసారి తుడిచినట్లుగా శూన్యం అందులోంచి బయటపడ్డాడు.

చిరునవ్వు.

"దాసరాజా! మీకు మాట యిస్తున్నాను. నా పుత్రులు, పౌత్రులు, ప్రపౌత్రులు కానీ ... ఎవరైనా సరే ... ఎప్పుడైనా సరే ... ఏనాడైనా సరే ... మీతోకానీ, నాతోకానీ, మీ పుత్రిక సత్యవతితోకానీ ... పైతృకాధికారాల్ని, హక్కుల్ని అడగరు."

ఓ క్షణం ఆగాడు.

"నేను పంచభూతాల్ని సాక్షిగా చేసుకుని ప్రతిజ్ఞ చేస్తున్నాను. నేను ఆజన్మాంతం బ్రహ్మచారిగా, అవివాహితుడుగానే ఉండిపోతాను."

అందరికీ నరనరాల్లోంచి మెరుపులు జరజరా పాకినట్లుగా అనిపించింది. భూమి ఆ త్యాగాభారాన్ని మోయలేక ఊగిపోయింది. కంపించింది. పంచభూతాల్లో అలజడులు, ప్రకృతి వణికిపోతున్నట్లుగా అనిపించింది.

తేరుకున్న మంత్రి ఓ అడుగు ముందుకేశాడు.

"యువరాజా! ఏంవిటిది? మీరు ఎందుకిలా చేసారు?"

చెరగని చిరునవ్వుతో అన్నాడు దేవవ్రతుడు.

"నన్ను నేను రక్షించుకుంటున్నాను మహామంత్రీ! ఎంతో హాయిగా ఉంది. ఇప్పుడు నాకు జీవితం యమపాశం కాదు. కామపాశం కాదు. ఇప్పుడు నా మనస్సులో స్త్రీ గురించి వికారాలుండవు. సంపదలు, అధికారాలు వీటిమీద వ్యామోహం ఉండదు. మా తల్లి కూడా ఇలాంటి బంధాల్నించి, యిలాటి వ్యామోహాలనుంచి ముక్తుడిని చెయ్యాలని అప్పుడే అనుకుంది. అప్పుడు నెరవేర లేదు. ఇప్పుడు సమయం వచ్చింది."

ఆ మాటల్లో పశ్చాత్తాపం లేదు.

ద్వంద్వార్థం లేదు.

దాసరాజు చేతులు జోడించి కాళ్ళమీద పడిపోయాడు.

"యువరాజా! మీరు సామాన్య మానవుడు కాదు. మీరు దేవుడు. మీలో గంగ పవిత్రత ఉంది. నేను ఛండాలుణ్ణి. మీలాటి మహాపురుషుడి జీవితంలోంచి, సంపూర్ణ సుఖాల్ని లాగేసాను."

"మీకు తెలీదు, కానీ, మీరు నాకు చాలా మేలే చేసారు. లేవండి. మీ పుత్రికని పంపే ఏర్పాట్లు చెయ్యండి."

✧ ఫిబ్రవరి 2001 ఆంధ్రభూమి వారపత్రిక ✧